# అంతర్మథనం

సుబ్బారావుకి కోపంవచ్చింది.

మిగిలిపోయిన సగంఇడ్లీ వున్న ప్లేటు కిటికీలోంచి విస్సిరి పారేయాలనిపించింది. సాంబార్ గిన్నెనూ, నీళ్ళగ్లాసునూ కౌంటర్ మీదకు గిరవాటేయాలనిపించింది. ఎదురుగా వున్న టేబిల్‌ను బలంగా తన్నాలనిపించింది. స్పూన్‌లతో సర్వర్ ముఖం రక్కాలన్నంత కోపం వచ్చింది.

అసలు మొన్నీమధ్య సుబ్బారావుకి చీటికీ, మాటికీ, చిరాకూ, కోపం, కసి, పగ ఫౌంటెన్‌లా తన్నుకొస్తున్నాయి. ఈ మనుషులు, సంఘం, సమాజం, అంతా.... అంతా.... తనను మోసం చేస్తున్నట్లుగా, తను వాళ్ళ చేతుల్లో దగా పడుతున్నట్టుగా అనిపిస్తోంది.

అందుకు కారణం లేకపోలేదు!

○ ○ ○

బాచులర్ డిగ్రీతో బాచులర్‌గా ఉంటున్న సుబ్బారావుకు సరసరాన బద్ధకం జీర్ణించుకుపోయింది. పొద్దున్నే లేచి- అంటే తొమ్మిది గంటలకు- ఐదు, పది నిముషాలపాటు నీరసంగా ఆవలిస్తూ కుర్చీలో కూర్చుని, భారంగా అడుగులేస్తూ బాత్రూంచేరి దంతధావనం చేసుకొని, బట్టలేసుకుని, హోటల్లోపడి, ఏదో తిని, పడుతూ లేస్తూ డ్యూటీకెళ్ళి, మళ్ళీరాత్రి ఏ పదికో వచ్చి నిద్రపోవడం అతని రోజువారి దినచర్య. అతను కాలక్షేపం కోసం బ్రతుకుతున్నట్టనిపిస్తుంది.

అతను పూర్తిగా హోటళ్ళమీదే ఆధారపడతాడు. ఎప్పుడో తప్ప అతను భోంచెయ్యడు. మూడుపూట్లా టిఫినే!

'అన్న' ప్రభుత్వం వచ్చిన తర్వాత హోటల్ రేట్లు తగ్గించినందుకు సుబ్బారావు బాగానే సంబరపడ్డాడు- పాపం ఇడ్లీ, వడలు పూర్తిగా చిక్కిపోయినప్పటికీ!

ఈ వ్యవస్థ మీద "కసి" అప్పటికింకా పెరగలేదతనికి.

అంతలో పిడుగులాంటి వార్త!

సుబ్బారావునే గాక, యావదాంధ్ర దేశాన్ని ఆశ్చర్యాందోళనలతో ముంచెత్తింది.

దేశప్రజలంతా ఉలిక్కిపడి లేచి, ముక్కుమీద వేలేసుకొని చూశారు- హైదరాబాదు రాజభవనం వైపు!

ఆ మరునాడు ఉదయం హోటల్లోకి ప్రవేశిస్తూనే యజమాని ముఖంలో ఓ వింత వెలుగు తచుక్కుమనటం సుబ్బారావు గమనించాడు.

అయోమయంగానే టిఫిన్ కానిచ్చాడు. సర్వర్ ఒక రకమైన చిర్నవ్వుతో బిల్లు అందించాడు.

యేపూరి కోటేశ్వరరావు



ఒకటీ ఎనభై ఐదు పైసలుండాల్సిన బిల్లు, రాక్షసిలా మూడూ సంభై కి పెరిగిపోయి భయపెట్టింది! పాపం సుబ్బారావు కలవరపాటు కప్పిపుచ్చుకుని ముఖమ్మీద నల్లటి నవ్వు పులుముకుని నోరు తెరిచి అడగబోయాడు. అంతలో సర్వరే "ఎన్టీఆర్ టిఫిన్ లేదాన్నర్.... ఎన్టీఆర్ దిగిపోయాడు గదా... రేట్లు పెరిగినై" అంటూ వెళ్ళిపోయాడు.

**"అన్యాయం"** అని పెద్దగా అరిచాడు సుబ్బారావు. కానీ ఆ కేక గొంతు దాటలేదు!

○ ○ ○

కాలం గడుస్తోంది. ఎవరూ పట్టించుకోలేదు.

దినపత్రికకు 'ఉత్తరాల శీర్షిక'లో హోటల్ రేట్ల గురించి ఉత్తరం వ్రాశాడు. అదీ ప్రింటు కాలేదు.

అప్పుడు సుబ్బారావుకు ఉక్రోషం వచ్చింది.

అప్పట్నించీ సుబ్బారావుకు కోపం రావడం మొదలైంది.

ఆ క్షణం నుంచీ సుబ్బారావులో చైతన్యం రగిలింది.

ఆలోచనాశక్తి అభివృద్ధి చెందింది!

కుండలినీశక్తి జాగృతి చెంది షట్చక్రాలు భేదించుకొని సహస్రారం చేరి నట్లు— ఆ తర్వాత జరిగిన ప్రతి సంఘటనా సుబ్బారావులో అరికాలి మంట నెత్తికెక్కేలా చేశాయి!

తన ఆలోచనలన్నీ పనికిమాలినవేనా?

ఈ సమస్య ఒక సమస్యే కాదా? మరి పేపర్లో ఎందుకు ప్రచురించలేదు?

అధిక ధరలకు, పెట్టుబడిదారుల దోపిడీలకు అలవాటు పడిపోయారా? ప్రజల్లో చైతన్యం ఏమైపోయింది? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, అక్రమంగా అన్నను గద్దె దించినందుకు, ప్రజల్లో పొంగిన ఆవేశం. ఆ చైతన్యం ఇప్పుడు ఈ విషయంలో– ధరల నరికట్టడంలో– ఎందుకు ప్రజ్వరిల్లటం లేదు? ఒక్కరోజు "హోటళ్ళకు పోము" అని తమ నిరసన ఎందుకు వ్యక్తం చెయ్యరు?

ఇలాంటి ఆలోచనలు సుబ్బారావు మస్తిష్కాన్ని చెదల్లా తొలచటం ప్రారంభమైంది ఆనాటి నుంచీ—

సరే, ప్రస్తుతం ఇడ్లీ ప్లేటు కిటికీ లోంచి పారెయ్యాలన్నంత కోపం రావటానికి కారణం :


సుబ్బారావు కొంచెం సాంబారడిగాడు. ఆ సర్వర్ చెంప మీద కొట్టినట్టుగా "ఇవ్వరు" తకీమని చెప్పాడు. కొట్టిన చెంపను సవరిస్తున్నట్టుగా "ఎక్స్ట్రా ఛార్జి అవుతుంది" అన్నాడు. రెండు ఇడ్లీలకు రూపాయిరవై పైసలు తీసుకోవడమే అన్యాయమని అతని అంతరాత్మ ఘోషిస్తూంటే రెండు స్పూన్ల సాంబారుకు మళ్ళీ ఇరవై పైసలు అదనం!

అందుకు, సుబ్బారావుకు కోపం వచ్చింది!

ఆ కోపం బాధగా మారింది. హద్దులు మీరిన 'దోపిడి' ఇనుప హస్తంతో హోటల్ యజమాని తన హృదయాన్ని పిండినట్లుగా విలవిల్లాడి పోయాడు, పాపం సుబ్బారావు.

సుబ్బారావు ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడడు. సున్నితమైన అతని మనస్సు ఎవరు చిన్న మాటన్నా భరించ లేదు. తీవ్రంగా గాయపడుతుంది. గంటల తరబడి బాధపడ్తూ, మధన పడుతుంది. ప్రతి చిన్న విషయం గురించీ తీవ్రంగా ఆలోచిస్తాడు– భూతద్దంలోంచి చూసి భయపడతాడు.

సుబ్బారావుకి కోపం వచ్చినపుడు ప్రవర్తించే తీరు, పగ తీర్చుకునే పద్ధతీ విచిత్రంగా ఉంటుంది. ఓసారి రాత్రి పదకొండు గంటలకొచ్చి ఏమో వ్రాసుకుంటున్నాడు. ఇంటి యజమాని లైట్ తీసేశాడు. ఎందుకంటే పదిదాటితే లైట్ వేసుకోకూడదట 'నేను పొద్దుట్నించీ రాలేదు. వచ్చిందిప్పుడే, అరగంట కూడా కాలేదు' అని సుబ్బారావు చెప్పినా వాళ్ళు వినలేదు. సుబ్బారావుకి కోపం వచ్చింది. అప్పట్నించీ మూడు నెలలపాటు అసలు లైటు వేసుకోలేదు. దీపం పెట్టుకునేవాడు. ఇలా తనకు




తాను శిక్ష వేసుకుంటాను, మరోసారి అద్దె కట్టడం లేటయ్యింది రెండురోజులు. యజమాని కోపంగా 'ఇట్లైతే లాభం లేదు. రూం ఖాళీ చెయ్యండి' అన్నాడు. సుబ్బారావు తక్కువ తిన్నాడా! 'హుఁ నాకసలు రూమే అక్కరలేదు' అంటూ ఇంట్లో ఉన్న సామానంతా తీసి రోడ్డు మీద పడేశాడు సుబ్బారావు- మిత్రుడొచ్చి ఆపేవరకూ. అతనికి 'ఎమోషన్' వస్తే 'రియాక్షన్' ఇలా ఉంటుంది!

అదే రోజు మధ్యాహ్నం చాలా రోజుల తర్వాత భోంచెయ్యాలనిపించింది సుబ్బారావుకి. హోటల్‌కెళ్ళాడు. ప్లేట్ మీల్స్ నాలుగున్నర. నాలుగున్నర ఇచ్చినందుకు అంతగా బాధపడలేదు గానీ ఆ భోజనం చూసిన తర్వాత మాత్రం, అతనిలోని బాధ కట్టలు తెంచుకొని ఆవేశంగా మారింది.

ఉప్పూ, కారం లేని పంతాయకూర, ఏ మాత్రం వంటరానివాడు మొదటిసారి వండినట్లున్న పప్పు, రసం నీళ్ళు, మాడిన వాసనతో సాంబారు, మజ్జిగ లాంటి పెరుగు, అందంగా అలంకరించిన రెండు ముద్దల అన్నం, ఓ పాపడం- అంతే.

ఒక్కసారి చుట్టూ చూశాడు.

ఏ ఒక్కరూ ఇది భోజనమేనా అని అడగటం లేదు. ఆదరా బాదరా తింటున్నారు. హడావుడిగా పోతున్నారు. వాళ్ళు దోచుకుంటున్నారు అంటే ఆ తప్పు వాళ్ళది కాదు- మనది! ఇదుగో వీళ్ళందరిదీ!" అనుకున్నాడు.

నట్టడవిలో ఏనాడో, ఓ ఇరవై మంది సాయుధులైన బందిపోట్లు కళ్ళెదుటే దోచుకుంటున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఈ 'కంజ్యూమర్స్'లో కనిపిస్తోంది. కాకపోతే ఆ పద్ధతి మొరటుగా వుంటే ఇప్పటి పద్ధతి నాగరికంగా, శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా ఉన్నట్లే అనిపిస్తోంది. వీళ్ళల్లో విజ్ఞానం, చైతన్యం ఏమయ్యాయి. అన్యాయాన్ని 'అన్యాయం' అని ఎందుకు చెప్పలేరు? ఎందుకి ఆత్మవంచన?

"ఏమయ్యా పెరుగు మరీ నీళ్ళలా

వుందే?" అడిగాడు సుబ్బారావు.

"రాత్రి పాలు రాలేదండీ. ఇది కొన్న పెరుగు" విదిలించుకుంటూ చెప్పాడు సర్వర్.

ఈ సంఘటనతో అతడిలో కసి మరింత పెరిగింది.

o o o

స్వయంపాకం మొదలెట్టాలనుకున్నాడు సుబ్బారావు.

కిరోసిన్ కోసం వెళ్ళాడు-

రేషన్ కార్డ్ కావాలట-

కార్డ్ లేకుంటే కిరోసిన్ ఇవ్వరుట.

ఇస్తారు కానీ లీటరుకు ఒక రూపాయి చొ॥న అదనంగా చెల్లించవలసి వుంటుంది;

ధర్మదేవత ఒంటికాలితో కాదు— కుంటికాలితో దీనంగా నిలబడ్డట్లు కన్పించింది సుబ్బారావు మనోనేత్రానికి!

ఆ తర్వాత రెండు మూడుసార్లు డ్యూటీ ఎగ్గొట్టి రేషన్ కార్డులిచ్చే ఆఫీస్ కెళ్ళాడు- కార్డు కోసం సుబ్బారావు. ఓసారి అప్లికేషన్ పెట్టమన్నారు. ఆ తర్వాత ఫలానా తారీఖునా, ఫలానా రోజునా, అంటూతిప్పారు. కానీ నోకార్డ్!

o o o

సెకండ్ షో కెళ్ళాడు సుబ్బారావు. టిక్కెట్లు బ్లాక్‌లో అమ్మేవాళ్ళను చూసి అంతగా పట్టించుకోలేదు. కానీ థియేటర్ బయట 50 పైసలకిచ్చే టీ లోపల 70పైసలు!- సినిమా ఇంటర్వెల్‌లో— ప్రజల బలహీనతను కనిపెట్టి, గేటు బంధించి. మరీ కొనిపిస్తున్నారు. ఇలాగే మిగిలిన అన్నీ తినుబండారాలు కూడా.

ఏ ఒక్కరికి ఇది దారుణంగా కనిపించటం లేదే? ఏదో చాలా ఈజీగా "ఇంతేగా ఎక్కువని" కొన్నేస్తున్నారు. దోపిడీ విధానాన్ని పెంచుతున్నారు-

"ప్రతిమనిషీ మరొకరి దోచుకునే వాడే...." మరీ ఇంత దారుణంగానా?! అనిపించింది సుబ్బారావుకి.

సినిమా చూసి వస్తుంటే దారిలో ఒక చిన్న పిల్లోడు మాసిన చొక్కా, చినిగిన నిక్కరుతో ఎదురయ్యాడు. మెడలో ఓ ట్రే వ్రేలాడ గట్టుకుని, అందులోని సిగరెట్లు అమ్ముతున్నాడు. అసలు రేటుకంటే అయిదేసి పైసలెక్కువతో.

మానవుల్లో వున్న రెండే రెండు వర్గాలు— దోచుకునే వాళ్ళు, దోచుకోబడే వాళ్ళు. పెట్టుబడి దారులు, కార్మికుని శ్రమశక్తిని దోచుకుంటారు.

ఐతే, ఈ కుర్రాడు కాపిటలిస్టా? వీడిలా అమ్మటం దోచుకోటం కాదా? వీళ్ళంతా వాడికెందుకు ఆ అవకాశాన్ని ఇస్తున్నారు? పాన్ డబ్బా తెరచి ఉన్నప్పుడే ఎందుకు కొనుక్కోరు?

మనిషి బలహీనతల్ని కనిపెట్టి డబ్బు చేసుకోవటం సాటి మనిషికి అలవాటై పోయింది.

o o o

ఇంటి యజమాని మాటలు కాస్త గట్టిగా వినిపిస్తున్నాయి.

"మేం రూం అద్దెకిచ్చింది మీ ఒక్కళ్ళకండీ.... మీరు ఇంకొకళ్ళని తీసుకొస్తేఎలా? ఇద్దరం ఉంటామని ముందు చెప్పలేదుగా! ఇద్దరికైతే కిరాయి యాభై రూపాయలు ఎక్కువౌతుంది... మీ ఇష్టం.... మొత్తం నూటయాభై ఇచ్చేటట్టుంటే ఉండండి. లేకపోతే ఖాళీ

చెయ్యండి..."

సుబ్బారావుకు ఆ మాటలు కాస్త విచిత్రంగా అన్పించాయి!

ఒకళ్ళకయితే వంద.... ఇద్దరికైతే నూటయాభై.... ముగ్గురికైతే....? ఏమో

మనుషులు పెరిగేకొద్దీ గోడలు జరిగి రూములు పెద్దవి కావుగదా?! ఎన్నిసార్లు 'అన్యాయమ'ని అరుస్తాడు?! పాపం సుబ్బారావు! "పుణ్యభూమీ కళ్ళు మూసుకో" అనుకున్నాడు సుబ్బారావు కళ్ళు తెరిచి.

ం ం ం

సీతాఫల్‌మండీలో ఎనభై ఆరో నెంబరు బస్సుకోసం వెయిట్ చేస్తున్నాడు సుబ్బారావు పావుగంట నుంచీ, బస్సు రాక పోవటంతో విసుగెత్తి పక్క హోటల్లో కెళ్ళి, టీ త్రాగి, బిల్లూ, రూపాయి నోటూ ఇచ్చాడు కౌంటర్లో.

"అరవై పైసలు చిల్లరివ్వండి" అన్నారు హోటల్ జమాని.

జేబులు వెదికి "లేవు" అన్నాడు సుబ్బారావు.

ముప్ఫై ఐదు పైసలు తిరిగిచ్చాడతడు.

"ఇదేంటి నలభై పైసలు కదా నాకు రావల్సింది?"

"చిల్లరిస్తే అరవై పైసలే.... చిల్లర లేకుండే అరవై ఐదు పైసలు అవుతుంది? మేం కమీషనిచ్చి చిల్లర కొనుక్కుంటు న్నాం...." అన్నాడా హోటల్ యజమాని.

సుబ్బారావు మెదడు మొద్దుబారి పోయింది!

అంతలో బస్ వస్తే ఎక్కేశాడు.

ం ం ం

అసలే సుబ్బారావుకు "ఇన్ ఫీరియారిటీ కాంప్లెక్స్" ఎక్కువ. 'ఒకరిచేత మోసగింపబడుతున్నాను' అనే భావనకు అసలు తట్టుకోలేడు.

ఇక్కడ రెండు రూపాయలకొన్న అదే వస్తువు, పక్క దుకాణంలో రూపాయిన్నర అని తెలిస్తే మోసపోయానని బాధపడ్తాడు!

ఇక్కడ పావుకిలో ముప్పావలాకి కొన్న టమాటో పక్కషాపులో రూపాయి క్కొన్నానని మిత్రుడు చెప్తే "దోపిడీ" అని ఆవేశ పడిపోతాడు!

"వీధికో రేటు చొప్పున మార్పుండ కూడదు. ఫిక్స్‌డ్ రేట్లుండాలి" అనుకొంటాడు.

ఇలా ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు.

మొన్నీమధ్య జరిగిన సంఘటనలన్నీ మనస్సులో మెదులుతున్నాయ్.

పదకొండు గంటలయింది. నిద్ర రావటం లేదు సుబ్బారావుకి.

మునిరేదోములు కాదు- అతని నిద్రకు ఆటంకాన్ని కల్గించింది- చెలరేగే ఆలోచనలు!

ం ం ం

పెరిగే ధరల గురించి ఇరుగు పొరుగు వారి అభిప్రాయాల్ని సమీక్షించాడు సుబ్బారావు.

"ఏం చేస్తావ్ ఎంతరేట్లున్నా కొనక తప్పుతుందా? తినక చస్తామా?!" అని బాధతో చెప్పేవాళ్లే అంతా!

"మీరెన్నయినా చెప్పండి... ఏమైనా చేయండి.... ఈ ధరల్ని తగ్గించటం- దోపిడీని అరికట్టడం అ సం భ వం" అన్నారు కొంతమంది కార్మికులు.

ప్రజల్లో పెరిగే భరంపట్ల పూర్తిగా నిరాసక్తత, నిర్లిప్తత ఏర్పడి పోయింది! ప్రభుత్వమైతే పట్టించుకోవడమే లేదు!

ఏం చేయాలి! ఏదో ఒకటి చేయాలి.

ప్రజల్లో జాగ్రుతి కల్గించాలి

చైతన్యం రగిలించాలి!

ఎలా? ఎలా??

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు మనస్సులో ఓ మెరుపు మెరిసింది.

అవును, అలా చేస్తే!

ప్రజల దృష్టీ, ప్రభుత్వం దృష్టీ తన వైపు తిరుగుతుంది.

పెన్నూ, పేపరూ తీసుకుని ఓ ఉత్తరం వ్రాశాడు గబ గబా! దాన్ని మడిచి కవర్లో పెట్టాడు.

ఆ తర్వాత మరో ఏడెనిమిది అంశాలమీద కూడా తన అనుభవాలను వ్రాశాడు హడావుడిగా. ఈ పేపర్లను ఓ కవర్లో పెట్టి ఓ పత్రిక అడ్రస్ వ్రాసి స్టాంపులంటించి పోస్టుబాక్సులో పడేశాడు.

రూమ్‌లో ఉన్న పెద్ద అల్యూమినియం కాన్ తీసుకుని సెక్రటేరియట్ బస్సెక్కాడు సుబ్బారావ్. యాభై పైసల బిళ్ళిచ్చాడు. ఎక్కడికెళ్ళాలో చెప్పి, "నలభై పైసల చిల్లర లేదా?" అడిగాడు, కండక్టరు.

"ఊహు" అన్నాడు సుబ్బారావు.

నలభై పైసల టిక్కెట్టు ఇచ్చి వెళ్ళిపోయాడు కండక్టరు పది పైసలు ఇవ్వకుండానే,

ఈసారి సుబ్బారావుకి కోపం రాలేదు! పెదవులపై ఓ వింత చిర్నవ్వు!

ఎంతోమంది మహాత్ములు తమ ప్రాణాల్ని అర్పించారు – తమ ప్రజల కోసం పీడిత సోదర జనుల కోసం—

కానీ, వాళ్ళాశించిన ఫలితం ఏదీ??

సెక్రటేరియట్ దగ్గర బస్సు ఆగింది.

"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను!"

సుబ్బారావు హృదయంలో "శ్రీ శ్రీ జయభేరి" మ్రోగుతూంది!

బస్సు దిగి వెనక్కి వచ్చాడు. యల్.ఐ.సి. పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ దగ్గరకు వెళ్ళి ఆరు లీటర్ల పెట్రోల్ కొన్నాడు.

జేబులో అగ్గిపెట్టె తడిమి చూసుకున్నాడు.

వడివడిగా సచివాలయం వేపు నడవసాగాడు సుబ్బారావు. హఠాత్తుగా అతనికో ఆలోచన వచ్చింది. "తనతో పాటు ఆ ఉత్తరం కూడా తగలబడుతుంది కదా! ఎట్లా? అం ముందు ఉత్తరం తీసి క్రింద పెట్టి, ఒకరాయి బరువుగా వుంచితే సరి...."

అంతలో "అమ్మా...." అని ఓ పెద్ద వెర్రి కేక వినిపించింది. జనమంతా అటు చూశారు.... గుంపు గూడారు....

దగ్గర్లో ఉన్న ట్రాఫిక్ పోలీసు, కొంచెం దూరంగా ఉన్న పోలీస్‌వాన్‌లో ఉన్న యస్.ఐ. ఆస్పాట్‌కి హడావిడిగా చేరారు.

రాక్షసిలాంటి డబుల్ డెక్కర్ కింద రక్తపు మడుగులో శవంలా పడిఉన్న ఓ నిర్భాగ్యుడు.

వంకర్లు పోయిన పెద్ద టిఫిన్, ఒలికిపోయిన పెట్రోలు, దాని కొక్కెం మాత్రం ఆ నిర్భాగ్యుని చేతిలో గట్టిగా

బిగుసుకుపోయి వుంది. పై జేబులోని అగ్గిపెట్టె పూర్తిగా తడిసిపోయి, చెల్లా చెదురుగా పడి వున్నాయ్ పుల్లలన్నీ!

తెల్లటి షర్టు ఎర్రగా మారింది!

అందరి మస్తిష్కాల్లో ఓ ఎర్రటి ప్రశ్న!

"శ్వాస ఆడుతోంది సార్!" గట్టిగా అరిచాడు ట్రాఫిక్ పోలీసు. జీపులో హాస్పిటల్‌కు చేర్చారు.

"ఏమైంది? ఏమైంది" అంటూ కొందరు, "పాపం ఏదో ఆలోచిస్తూ పడి ఉంటాడు" అని కొందరు, 'ఇది ఆత్మహత్యే కావాలనే పడ్డాడు' అని మరి కొందరు ఇలా రక రకాలుగా వ్యాఖ్యానిస్తూ తలోదారీ వెళ్ళిపోయారు.

ప్రభుత్వాసుపత్రిలోని క్రొత్తరక్తాన్ని సుబ్బారావులోకి ఎక్కిస్తున్నారు

అతని జేబులోని ఉత్తరాన్ని ఎస్ ఐ తీసుకుని చదివి, కేసు వ్రాసుకుని, కోర్టుకి పంపించాడు సదరు ఉత్తరాన్ని—

ం ం ం

"దేశంలోని న్యాయమూర్తులందరికీ నమస్కారాలు. ఇది నా మరణ వాఙ్మూలము—

నన్ను నేనిలా తగల బెట్టుకుని చనిపోవటం ఆత్మహత్య కాదు.

క్షణక్షణం మోసపోతూ, అన్యాయాన్ని ఎదిరించలేక, తలవంచి, రాజీపడి, జీవచ్ఛవంలా నేనూ బ్రతుకగలను. బ్రతకటం చేతకాక కాదు నేను చనిపోతున్నది. ఈ నా మరణం ప్రజలలో చైతన్యం కలిగించి, అన్యాయా న్నెదుర్కొనటానికి దోహదం చేస్తుందేమో నన్న ఆశతో దహించుకు పోతున్నాను.

ఇప్పుడు కాలి బూడిదయింది నా శరీరం కాదు—

ప్రజల్లో జడత్వం.

నా ఆశయాన్ని అర్థం చేసుకుని, నా 'తుదికోరిక'ను తీరుస్తారని ఆశిస్తున్నాను.

నానాటికీ పెరుగుతున్న ధరలను అరికట్టడంలో ఘోరంగా విఫలమైన ఈ ప్రభుత్వమే నా చావుకు కారణమంటాను. ఈ ప్రభుత్వాన్ని శిక్షించండి.

నిత్యావసర వస్తువుల్ని సైతం విచ్చలవిడిగా వాళ్ళిష్టమొచ్చిన రేట్లతో అమ్మే ఈ వ్యాపారులే నా చావుకు కారణం! వాళ్ళను శిక్షించాలి.


ఇప్పుడిప్పుడే తలెత్తుతున్న చిల్లర సమస్యనుపెంచి, దాన్నొక వ్యాపారంగా మార్చే అవినీతి పరులను శిక్షించండి.

మనిషి హృదయములో "దోపిడి" అనే మాటను చెరిపివేయడానికీ, మానసిక పరివర్తన తీసుకురావడానికి గట్టి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

తమ రెక్కల కష్టంతో బ్రతికే సామాన్యుల జీవితంలో మనశ్శాంతిని ప్రసాదించ దలచుకుంటే పైన చెప్పిన వారిని శిక్షించండి.

కనీసం అత్యవసర వస్తువుల విషయంలోనైనా, దోపిడి జరుగకుండా— మాలాంటి సామాన్యులకవి అందుబాట్లో ఉండేట్టు చేయండి.

ఇది చదివిన మీకు నేను ఉన్మాదిలా కన్పించవచ్చు. ఈ రాతలు మీకు పిచ్చి గీతల్లా కన్పించవచ్చు. ఇవన్నీ మీకు పెద్ద సమస్యలుగా కనిపెంచక పోవచ్చు మీరు అర్థికంగా బాగా ఉన్నవాళ్లే కాబట్టి సామాన్యుల సమస్యలుఅర్థంకాకపోవచ్చు.




దయచేసి ఈ సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించ గలరని నా తుది ప్రార్థన

ఇట్లు

సుబ్బారావు.

ఉత్తరాన్ని చదవటం ముగించి బోను వైపు చూశాడు న్యాయమూర్తి.

మాసిన బట్టలు, పెరిగిన గడ్డం, తలకు కట్టిన గాజు గుడ్డపై ఓ ఎర్రటి మరక. జీవంలేని గాజు కళ్ళలా అతని చూపులు శూన్యంలో చిక్కుపడ్డాయి. అతనికంతా అయోమయంగా ఉంది.

కేసు విచారణ ప్రారంభమైంది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి "యువ రానర్, బోనులో నిలబడ్డ ఈ ముద్దాయి ఆత్మ హత్య చేసుకోబోయాడన్నది. ముద్దాయి వ్రాసిన ఆ ఉత్తరాన్ని బట్టి తెలుస్తోంది. ఆత్మహత్యా నేరం కింద ముద్దాయిని శిక్షించవలసిందిగా కోర్టు వార్ని కోరుతున్నాను. దట్సాల్, యువ రానర్."

సుబ్బారావు వెర్రిగా పి. పి. వైపు న్యాయమూర్తి వైపు చూస్తున్నాడు.

"నీకేమైనా చెప్పుకోవాలనుందా ?" న్యాయమూర్తి అడిగాడు సుబ్బారావుని.

న్యాయపీఠంపై ఠీవిగా కూర్చుని. నిష్పక్షపాతంగా తీర్పు చేప్పే న్యాయమూర్తికి సుబ్బారావు మనసులో ఉన్నత స్థానం ఉంది. న్యాయమూర్తులూ. వైద్యులూఅంటే చెప్పలేనంతగా గౌరవం అతనికి !

అప్రయత్నంగా తల అడ్డంగా వూపాడు సుబ్బారావు !

న్యాయమూర్తి తలపంకించి తన తీర్పునిలా చదివాడు.

"ఈ ముద్దాయి ఆత్మహత్య చేసుకోబోవటానికి కారణం, జీవన ప్రమాణం స్వల్పంగా ఉండటం, అధిక ధరలకు తట్టుకోలేక పోవడమని కోర్టు భావిస్తోంది. ఆత్మహత్యా నేరంకింద అతన్ని శిక్షించవలసి ఉన్నప్పటికీ అతని సమస్యను కోర్టువారు సానుభూతితో అర్థంచేసుకుని, ఇక ముందెప్పుడు ఇలాంటి నేరానికి పాల్పడ కూడదని హెచ్చరిస్తూ ఈ ముద్దాయిని నిర్దోషిగా

విడుదల చేయడమైనది.

"ధరలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా కృషిచేయాలని కోర్టువారు ప్రభుత్వాన్ని ఆదేశించడమైనది.

○ ○ ○

సచివాలయం వద్దా, పక్క బస్టాపులోనూ తిరుగుతున్నాడు.

మాసిన బట్టలకు చిరుగులు పడ్డాయి. గడ్డం బాగా పెరిగిపోయింది. ఒళ్ళంతా దుమ్ముకొట్టుకొనిపోయింది. ఆ వెర్రి చూపుల్లో ఏదో అయోమయం. కొంచెం సేపు నవ్వుతాడు....కాసేపు ఆలోచిస్తాడు....మరోసారి బాధపడ్తాడు....ఒకోసారి కళ్ళల్లో కన్నీరు....

చుట్టు ప్రక్కల కనిపిస్తున్న ఈ ప్రపంచమే అతనికి కనిపిస్తుందో, లేక అతని ఊహల్లో 'మరో ప్రపంచం' వుందో! తెలీదు.

అప్పుడప్పుడూ గొణుక్కుంటాడు.

మహాసభ ముందు వేదికపై ఉపన్యాసం ఇస్తున్నట్లుగా మాట్లాడుతాడు ఒకోసారి.

ఆవేశంగా కేకలేస్తూ మాట్లాడుతాడు మరోసారి.

ఇప్పుడు తన వెనుక మహాజనం తరలి వస్తున్నట్లుగా, తను ఏవేవో స్లోగన్‌లు ఇస్తూ, చేయెత్తి జై కొడుతూ ముందుకు నడుస్తున్నాడు.

అక్కడి వాళ్ళు ఆశ్చర్యంగా, వినోదంగా, జాలిగా, అతని వైపు చూస్తున్నారు.

అతను ఓ చోట ఆగిపోయాడు.

అతని చూపులు గోడమీద ఓ పోస్టర్‌కు అతుక్కుపోయాయి.

హెడ్డింగ్ చదివాడు....

పక పకా నవ్వేడు....గట్టిగా నవ్వాడు....

"పై పైకి....! !"

"హహ్హా హ్హా....ప్రగతి పథంలో పై పైకి !"

తెరలు తెరలుగా నవ్వు !

"పెరిగి పోతున్నాయ్....పెరిగి పోతున్నాయ్...అన్నీ పెరిగిపోతున్నాయ్....జనం పెరుగుతున్నారు....ధరలు పెరుగుతున్నాయ్....దోపిడి పెరుగుతోంది....దరిద్రం పెరుగుతోంది...ఆకలి పెరుగుతోంది....ఆకలి చావులు పెరుగుతున్నాయ్...ఆత్మ హత్యలు పెరుగుతున్నాయ్...అభివృద్ధే...అంతా-అభివృద్ధే....నిరుద్యోగం....కట్నాల చావులూ...మతకలహాలు, హత్యలూ, అలజడీ....ఆందోళనా....అన్నీ పెరుగుతున్నాయ్....

హహ్హహ్హా...పై పైకి . పోతున్నాం...పోతున్నాం...పై పైకి...

ప్రగతి పథంలో పై పైకీ...

హహ్హహ్హా...హహ్హహ్హా...." గట్టిగా నవ్వుతున్నాడు.

అతడు ఫలానా సుబ్బారావనిఎవ్వరూ గుర్తుపట్టలేరు.

అతడో ఉన్మాది....అవి పిచ్చి కేకలు...

ఐనా వింటున్న వాళ్ళకు తెలుసు. ఆ మాటలు అక్షర సత్యాలని.

కొంతమందికి అతనితోపాటు గొంతు కలపాలనిపించింది. ఈ లోకం తమను కూడా "పిచ్చివాడు" అంటుందేమోనని భయపడ్డారు వాళ్ళు !